

జీవన్‌రెడ్డి ప్రచారంలో నృత్యం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



నందిపేట మండలంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో జీవన్‌రెడ్డికి పూలు చల్లి స్వాగతం ..

# నాది అభివృద్ధి, సంక్షేమ మంత్రం

- ఆర్మూర్ ప్రజల కోసం యంత్రంలా పని చేస్తున్నా..
- ఓటు వేసి మళ్లీ ఆశీర్వదించండి
- ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- నందిపేట్ మండలంలో జోరుగా ప్రచారం

నందిపేట్, నవంబర్ 6: 'నాది అభివృద్ధి, సంక్షేమ మంత్రమని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పదేండ్లుగా యంత్రంలా పని చేస్తున్నానని అన్నారు. సోమవారం మండలంలోని లక్కంపల్లి, చీంరాజ్‌పల్లి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మహిళలు బోనాలు, వందలాది మంది యువకులు బైక్ ర్యాలీలతో ఘనస్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగక్షేమాలను జీవన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలతో తనకున్న అనుబంధాన్ని ప్రజలతో పంచుకున్నారు. వందలాది మంది వెంట రాగా జీవన్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని, మళ్లీ తనను గెలిపించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సభల్లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తాను పదేండ్లలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే సౌభాగ్య లక్ష్మి పథకం అమలు చేస్తామని, అర్హులైన వారికి రూ.400లకే సిలిండర్, తెల్ల రేషన్ కార్డున్న వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమన్నారు. కేసీఆర్ తెచ్చిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని, పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందాయని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ తనన్ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు వచ్చి మాయమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు.

# కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలి

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- ఇస్సాపల్లిలో ఎన్నికల ప్రచారం

ఆర్మూర్, నవంబర్6: తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ఈ ఎన్నికల్లో ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఇస్సాపల్లి గ్రామంలో జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఆయనకు యువకులు, మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు జీవన్‌రెడ్డిపై పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు. పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఇస్సాపల్లిలో ఏర్పాటు చేసిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు కలలో కూడా చూడని అభివృద్ధిని ఈ పదేండ్లలో చూసారన్నారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, ఆర్మూర్ వంద పడకల దవాఖాన, 11 బైపాస్ రోడ్లు, రూ.20కోట్లతో సిద్దులగుట్ట ఘాట్‌రోడ్డు, ఉమ్మెడ–పంచగూడ బ్రిడ్జి, అర్బన్‌పార్క్, ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ వంటి ఎన్నో పనులు చేపట్టామని అన్నారు. తనను మళ్లీ దీవించాలని జీవన్‌రెడ్డి కోరారు. ప్రగతి నిరోధకులైన కాంగ్రెస్, బీజేపీ ఆరాచక శక్తులను ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలన్నారు. కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ముందుకు సాగేందుకు తనను మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దార్గ దివేద, దార్గ రాజు, ఎంపీటీసీ లినితా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కవాతు

నందిపేట్, నవంబర్ 6: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. పాత మండలం, బస్టాండ్, పాతూరు, రాజానగర్ ప్రాంతాల్లోని ప్రధాన వీధుల్లో పోలీసు సిబ్బంది వాహనాల కాన్వాయ్‌తోపాటు కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసులు కవాతు నిర్వహించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాహుల్, ఏఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## జీవన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించండి



గోవింద్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రజితారెడ్డి

ఆర్మూర్, నవంబర్6: ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరుతూ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ పాలనలో జీవన్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, ఆర్మూర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు మూడో సారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీలో గెలిపించాలని కోరారు. గోవింద్‌పేట్ గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, అందరికీ సంక్షేమ ఫలాలు అందించారని అన్నారు. వెంట పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వీఆర్ఈసీలో ప్రాంగణ నియామకాలు




ఎంపికైన అభ్యర్థులతో సంస్థ ప్రతినిధులు

మాక్లూర్, నవంబర్ 6 : విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇందులో ఎంబీఏ, బీటెక్ చదివిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాంగణ నియామకంలో భాగంగా వివిధ ఉద్యోగాలకు విద్యార్థులను ఎంపిక చేశామని సంస్థ ప్రతినిధి సత్యనారాయణ, హెచ్ ఆర్ వర్షిణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ అమృతలత అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గణేశ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




## శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్, నవంబర్6: పట్టణంలోని నవనాథ్ సిద్దేశ్వర శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. గుట్టపై భక్తులు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు